AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

2-11-2026 (Monday) MAIN EDITION

పంజాబ్‌లో 'ఆప్'కు షాక్



అక్షరటుడే, పంజాబ్ : పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి ఎమ్మెల్యేలు షాక్ ఇచ్చారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన ముగ్గురు ఎమ్మెల్యేలు సోమవారం బీజేపీలో చేరారు. సస్పెండ్ అయిన ఆప్ ఎమ్మెల్యే, మాజీ ఐపీఎస్ అధికారి కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ సోమవారం ఉదయం తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం బీజేపీలో చేరారు. ఆదివారం పార్టీని వీడిన మరో ఇద్దరు సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలు కూడా బీజేపీలో చేరారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఈ ముగ్గురినీ సస్పెండ్ చేశారు.

ఫ్లోరిడాలో కూలిపోయిన విమానం.. 9 మంది మృతి



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : ఫ్లోరిడాలో విమానం కూలిపోయింది. ఈ ఘటనలో 9 మంది చనిపోయారు. తొమ్మిది మందితో ప్రయాణిస్తున్న ఒక వ్యాపార విమానం ఆదివారం దక్షిణ ఫ్లోరిడాలో పేలిపోయింది. రద్దీగా ఉండే రోడ్డుపై విమానం పడిపోయింది. అనంతరం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విమానంలోని వారు అందరు ప్రాణాలు కోల్పోయారు.

విమాన ఛార్జీల పెంపుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



అక్షరటుడే, న్యూ ఢిల్లీ : విమాన ఛార్జీల పెంపుపై ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. టికెట్ ధరలు 700 శాతం పెరిగాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్ నాథ్ విమాన ప్రయాణం చేయకండని ఆ న్యాయవాదికి సూచించింది.

యూపీఐ జోరు.. రోజుకు రూ. లక్ష కోట్ల లావాదేవీలు



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: అక్టోబర్‌లో యూపీఐ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. అక్టోబర్ నెలలో మొత్తం జరిగిన లావాదేవీల విలువ రూ.31.53 లక్షల కోట్లుగా నమోదయ్యింది. యావరేజ్ డైలీ ట్రాన్సాక్షన్ వాల్యూ తొలిసారిగా రూ. లక్ష కోట్లను దాటింది. పండుగ సీజన్ నేపథ్యంలో లావాదేవీలు పెరిగాయి.


తుపాన్ ఎఫెక్ట్.. రాష్ట్రానికి భారీ వర్ష సూచన



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : బంగాళాఖాతంలో ఏర్పడిన మురాసు తీవ్ర తుపాన్‌గా మారింది. దీని ప్రభావంతో ఏపీతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మురాసు తుపాన్ మంగళవారం తీరాన్ని తాకే అవకాశం ఉంది.

పెన్షనర్లకు అలర్ట్..

అక్షరటుడే, ఢిల్లీ : పెన్షనర్లు తమ పింఛను ఎలాంటి అంతరాయం లేకుండా క్రమం తప్పకుండా పొందడానికి కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు జారీ చేసింది. ప్రతీ ఏటా నిర్వహించే వార్షిక 'జీవన్ ప్రమాణ్' (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) సమర్పణ ప్రక్రియ ప్రారంభమైంది. పింఛనుదారులు నవంబర్ 1 నుంచి 30వ తేదీ మధ్య తమ జీవన ప్రమాణ పత్రాన్ని తప్పనిసరిగా దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే, 80 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు మాత్రం అక్టోబర్ 1 నుంచే దీనిని సమర్పించే వెసులుబాటు కల్పించారు.



ఇంజిన్ లేకుండానే దూసుకెళ్లిన బోగీలు

అక్షరటుడే, తమిళనాడు : తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లాలో రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం తాలూకు విచిత్ర ఘటన వెలుగు చూసింది. జోలార్‌పేట జంక్షన్ రైల్వే యార్డులో నిలిపి ఉంచిన ఏడు ఖాళీ రైలు బోగీలు ఎలాంటి ఇంజిన్ లేకుండానే అకస్మాత్తుగా ముందుకు కదిలాయి. పట్టాలపై వేగంగా జారుకుంటూ ఏకంగా 6 కిలోమీటర్ల మేర ప్రయాణించిన ఈ బోగీలు.. తామలేరి ముత్తూరు సమీపంలోని ప్రధాన రైల్వే ట్రాక్‌పైకి చేరుకుని పట్టాలు తప్పాయి. బోగీలు ఖాళీగా ఉండటం, ఆ సమయంలో ఆ మార్గంలో వేరే రైళ్లు రాకపోవడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది.



వారంతా నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజులాగే సోమవారం సైతం ఓ రోడ్డు నిర్మాణం కోసం వచ్చారు. అయితే విద్యుత్ తీగల రూపంలో మృత్యువు వారిని కబళించింది. రోడ్డు పనుల్లో భాగంగా కాంక్రీట్ కలిపే మిషన్ విద్యుత్ తీగలకు తగలడంతో 8 మంది కార్మికులు చనిపోయారు. ఈ ఘటన రాజస్థాన్‌లో చోటు చేసుకుంది.

- అక్షరటుడే, నేషనల్ డెస్క్

రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం

- రోడ్డు పనుల్లో విద్యుత్ షాక్
- 8 మంది కార్మికులు మృతి
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం

రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లా చపోలిలో రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం పనులు చేపట్టడానికి కార్మికులు వచ్చారు. కంకర, సిమెంట్ కలిపే మిషన్‌ను అక్కడ పెట్టారు. అయితే ఆ మిషన్ ఎత్తుగా ఉండటంతో 11 వేల వోల్టుల (హై టెన్షన్) విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో యంత్రాన్ని ఆనుకొని ఉన్న కార్మికులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు. సమాచారం అందుకున్న కలెక్టర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (SP) సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు.

నలుగురికి తీవ్రగాయాలు

ఈ ప్రమాదంలో 8 మంది కార్మికులు మృతి చెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి ఖచ్చితమైన సంఖ్యపై అధికారిక ధృవీకరణ ఇంకా అందాల్సి ఉంది. ఈ ప్రమాదంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సైట్ సూపర్‌వైజర్లు బాధ్యత వహించాలని, భద్రతా నియమాలను పాటించడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రాణనష్టం జరిగిందని ఆరోపించారు.

సీఎం సంతాపం

ఈ ఘటనపై ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, బాధితుల కుటుంబాలకు తక్షణ సహాయం అందజేయాలని ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. ఈ ప్రమాదం హృదయ విదారకమని మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ అన్నారు.

పైసలు ఇస్తేనే పనులు: రాజగోపాల్‌రెడ్డి



అక్షరటుడే, నల్గొండ : సొంత ప్రభుత్వం మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంలచన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనలో పైసలు ఇస్తేనే పనులు చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి నుంచి మొదలు కొని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు పైసలు లేనిదే పనులు చేయడం లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేను అయిన తాను కూడా నిధుల కోసం ప్రతిపక్షంలా పోరాడాల్సి వస్తోందని మండిపడ్డారు.

కాంగ్రెస్ ర్యాలీ ఏఐ ఫొటోలపై కేంద్ర మంత్రి విమర్శలు



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం విపక్ష ఇండియా కూటమి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ర్యాలీకి సంబంధించిన పలు ఫొటోలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అయితే అవి ఏఐతో సృష్టించారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజ్ విమర్శించారు. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఇతర పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఈ చిత్రాన్ని ఉటంకిస్తూ, జనసందోహాన్ని చూపించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఏకంగా ఏఐ సృష్టించిన చిత్రాలను ఆశ్రయించిందని కిరణ్ రిజిజ్ ఎద్దేవా చేశారు.

పీఎఫ్ యూజర్లకు గుడ్‌న్యూస్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తన కోట్లాది మంది చందాదారులకు భారీ ఉపశమనం కలిగిస్తూ సరికొత్త డిజిటల్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై పీఎఫ్ ఖాతాదారులు వివరాల కోసం వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాల్సిన అవసరం లేకుండానే నేరుగా 'వాట్సాప్' ద్వారానే తమ ఖాతా బ్యాలెన్స్, చివరి లావాదేవీలు, పాస్‌బుక్ వివరాలను క్షణాల్లో పొందవచ్చు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ నూతన సేవలను అధికారికంగా ప్రారంభించారు. ఈపీఎఫ్ఓ సభ్యులు తమ యూఏఎన్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ నుంచి +91 8796441800 అనే అధికారిక వాట్సాప్ నంబర్‌కు "Hi" లేదా "Hello" అని సందేశం పంపడం ద్వారా ఈ సేవలను వినియోగించుకోవచ్చు.




ముసాను తుపాన్‌పై పవన్ సమీక్ష



అక్షరటుడే, ఏపీ : ఆంధ్రప్రదేశ్ తీరానికి మురాసు తుపాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజల తరలించాలని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలన్నారు.

నాయకుడి ఇంట్లో హెరాయిన్ పెట్టిన పోలీస్



అక్షరటుడే, పంజాబ్ : పంజాబ్‌లోని ఖన్నాలో శివసేన నేత మహంత్ కశ్మీర్ గిరి ఇంట్లో డ్రగ్స్ పెడుతూ ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్ అడ్డంగా దొరికిపోయాడు. పోలీసు బృందం రాకముందే సుఖ్‌దేవ్ సింగ్ సాదా దుస్తులలో ఇంట్లోని ఒక గదిలోకి ప్రవేశించాడు. అతను పరుపు కింద ఒక వస్తువును ఉంచి, ఆ తర్వాత గది నుండి బయటకు వెళ్లాడు. కొంత సమయం తర్వాత పోలీసులు వచ్చి ఇంట్లో తనిఖీలు చేశారు. వారికి బెడ్ కింద 30 గ్రాముల హెరాయిన్ దొరికింది. దీంతో గిరిని డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో అరెస్టు చేశారు. మహంత్ కశ్మీర్ గిరి ఇంట్లో ఏఎస్ఐ డ్రగ్స్ పెడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఏఎస్ఐ సుఖ్‌దేవ్ సింగ్‌ను ఎస్ఎస్పీ దర్పణ్ అహ్లూవాలియా సస్పెండ్ చేశారు.

కన్న కొడుకునే గొంతు నులిమి చంపిన తండ్రి



అక్షరటుడే, హైదరాబాద్ : కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్న కొడుకునే ఒక తండ్రి దారుణంగా గొంతు నులిమి హత్య చేశాడు. హైదరాబాద్ నగరంలోని బోరబండ పరిధిలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. శిల్పిన గర్‌కు చెందిన విద్యాసాగర్, దుర్గ దంపతులకు విజయ్ (5) అనే కుమారుడు ఉన్నాడు. నవంబర్ 1వ తేదీ రాత్రి విద్యాసాగర్ తీవ్రంగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఆ మత్తులో నిద్రిస్తున్న ఐదేళ్ల కన్న కొడుకు విజయ్‌ను దారుణంగా గొంతు నులిమి హత్య చేశాడు.

ఇండియా కూటమి ర్యాలీతో రూ.11 వేల కోట్ల నష్టం

అక్షరటుడే, ఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో విపక్ష ఇండియా కూటమి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ర్యాలీ కారణంగా తమకు రూ. 11 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని వ్యాపార సంఘం పేర్కొంది. పండుగలు, షాపింగ్ సీజన్ జరుగుతున్న తరుణంలో ఈ ర్యాలీ నిర్వహించడంతో, వేదిక చుట్టుపక్కల ఉన్న అనేక ప్రధాన మార్కెట్లు మూతపడ్డాయి. ఈ ర్యాలీ వల్ల వ్యాపారులకు రూ. 11,000 కోట్ల వ్యాపార నష్టం జరిగిందని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' వెల్లడించింది.

